


# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 8 2025 | సంపుటి :0 | సంచిక :233 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

నేడు మంత్రివర్గ ప్రమాణస్వీకారం
రాజ్‌భవన్‌లో ఏర్పాట్లకు ఆదేశాలు
ముగ్గురు లేదా నలుగురు ప్రమాణం
ఏయే వర్గాలకు ఛాన్స్ దక్కేది సస్పెన్స్



తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనుందని సమాచారం. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు- దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరు స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరకు పైగా కేబినెట్ విస్తరణ జరగలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య పెరిగింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానం చుట్టూ నేతలు తిరుగుతున్న పరిస్థితి. ఇటీవల మీనాక్షీ నటరాజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమె కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు-, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. ఈ క్రమంలో నేడు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. 2 లో..


## యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోంది



2 లో

దేశంలో గత 11 ఏళ్లుగా సుపరిపాలన సాగుతోందని, అందుకే యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

### మోదీ, అమిత్ షా వ్యాఖ్యలను ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తున్నారా?: ఆది శ్రీనివాస్



కాళేశ్వరం ప్రాజెక్టు కల్వకుంట్ల కుటుంబానికి ఏటీఎంగా మారిందని భాజపా నేతలు గతంలో చెప్పారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. 2 లో

## ఈటల తప్పుడు రిపోర్టు ఇచ్చారు..

త్వరలోనే కమిషన్ కు లేఖ రాస్తా: మంత్రి తుమ్మల



2 లో

## జనగణన ఆలస్యం

### కేంద్రం పన్నుతున్న దుష్ట పన్నాగమే: స్టాలిన్

కేంద్ర ప్రభుత్వం అన్ని లెక్కలు వేసుకొని కావాలనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనను ఆలస్యం చేస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు.



2 లో

## అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం



కాళేశ్వరం ప్రాజెక్టులోకి మేడిగడ్డ బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కూలినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు అన్నారు. 2 లో

## హైదరాబాద్ లో ఒక్కసారిగా

### మారిన వాతావరణం.. పలు చోట్ల భారీ వర్షం



హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారింది. శనివారం (జూన్ 7) ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోత ఉండగా.. మధ్యాహ్నానికి వెదర్ ఒక్కసారిగా కూల్ అయ్యింది. నగరంలోని జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్ పేట్, ఎస్ఆర్ నగర్, ఎర్రమంజిల్, లక్డీకపూల్‌తో పాటు పలు ప్రాంతాల్లో వాన కురుస్తోంది. ఒక్కసారిగా వర్షం కురువడంతో నగరంలోని పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పలు ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాలు, వరద నీరు నిల్వ ఉండే చోట్ల సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు కూడా వెంటనే అప్రమత్తమై వాహనాల రద్దీని క్లియర్ చేస్తున్నారు.

## యూట్యూబర్ల తీగ లాగితే

### గూఢచర్యం డొంక కదులుతోంది



**పాక్ గూఢచర్యం కేసులో అరెస్టయిన యూట్యూబర్ జస్బీర్ సింగ్‌ను అధికారులు విచారించగా.. పలు కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.**

పాకిస్థాన్‌కు గూఢచర్యం కేసులో యూట్యూబర్ జస్బీర్ సింగ్ ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అధికారులు అతడిని విచారించి కీలక విషయాలు రాబట్టారు. గూఢచర్య నెట్‌వర్క్ కు సూత్రధారి అయిన పాక్‌కు చెందిన మాజీ పోలీసు అధికారి గురించి జస్బీర్ పోలీసులకు తెలిపాడు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నాసిర్ ధిల్లాన్ పాక్‌కు చెందిన మాజీ సబ్ ఇన్‌స్పెక్టర్. ఇతడు గూఢచర్యం వ్యవహారాల్లో సూత్రధారిగా ఉన్నాడు. పేజి 2లో

## ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా

పార్లమెంటులో (3 ఫిబ్రవరి 2025న) నా ఉపన్యాసంలోను, అనంతరం విలేఖర్ల సమావేశంలోను గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలను నిర్వహించిన తీరు తెన్నుల పట్ల ఆందోళన వ్యక్తం చేశాను. మన దేశంలో ఎన్నికలు ఎప్పుడు, ఎక్కడ జరిగినా వాటి సక్రమ, నిష్పాక్షిక నిర్వహణను ప్రతిసారీ కానప్పటికీ అనేకసార్లు శంకించాను. చిన్నతరహా మోసం గురించి నేను మాట్లాడడం లేదుబీ మన జాతీయ సంస్థలను కైవసం చేసుకోవడంతో సహా సంభవిస్తున్న భారీ వంచనపై నా వ్యాకులతను వ్యక్తం చేస్తున్నాను. ఏమిటా వంచన? ఎన్నికల ఫలితాలను కుతంత్రంతో అనుకూలంగా మార్చుకోవడమే ఆ మోసం. అవును, మన ఎన్నికలలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరుగుతోంది. అంతకు ముందు కొన్ని ఎన్నికల ఫలితాలు విడ్డూరంగా ఉన్నా 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల ఫలితాలు అసాధారణంగా ఉన్నాయి. ఆ అనూహ్య ఫలితాలు నన్నూ, మరెందరినో దిగ్భ్రాంతి పరిచాయి. విజయంపై ఆశోపహతులయినవారు తెంపరితనంతో భారీ రిగ్గింగ్‌కు పాల్పడి సాధించిన ఫలితాలవి. ఆ వంచనను కప్పిపుచ్చేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ దాచిన వాస్తవాలు అన్నీ ఎలాంటి అనధికారిక మూలాధారాల ఆలంబనతో పనిలేకుండా అధికారిక గణాంకాల నుంచే బహిర్గతమయ్యాయి. అంచెలంచెలుగా ఆ అక్రమానికి పాల్పడేందుకు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలూ వెల్లడయ్యాయి. ఆ ఎన్నికల అక్రమం ఎలా మొదలై, ఎలా పరిపూర్తి అయిందో విపులంగా చూద్దాం. ప్రథమ పర్వం%-% ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించే అధికారులను నియమించే ప్యానెల్‌ను మార్చివేయడం: ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి, హెూం మంత్రి 2:1 మెజారిటీతో ఫలప్రదంగా ఎంపిక చేయడాన్ని 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం సుసాధ్యం చేసింది. ఆ నియమకాలపై నిర్ణయం తీసుకునే త్రిసభ్య ప్యానెల్‌లో మూడో సభ్యుడు అయిన ప్రతిపక్ష నాయకుడి సూచన ప్రతిసారీ మెజారిటీ ఓట్లతో తిరస్కృతమవుతుంది.ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి స్థానం కల్పించిన నిర్ణయం న్యాయబద్ధమైనది కాదు. నైతిక సమంజసత్వం లోపించిన నిర్ణయమది.రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘంలో తటస్థ మధ్యవర్తిని తొలగించేందుకు ఉన్నత పదవులలో ఉన్నవారు సంబంధిత నియామకాల చట్టాన్ని మార్చేందుకు పనిగట్టుకుని ఎందుకు ప్రయత్నించారు? ద్వితీయ పర్వం– నకిలీ ఓటర్లతో ఓటర్ల జాబితాను విస్తరించడం: 2019 విధానసభ ఎన్నికలలో మహారాష్ట్రలో నమోదైన ఓటర్ల సంఖ్య (ఎన్నికల సంఘం డేటా ప్రకారం) 8.98 కోట్లు. ఐదు సంవత్సరాల అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ఆ ఓటర్ల సంఖ్య 9.29 కోట్లకు పెరిగింది. అయితే కేవలం ఐదు నెలల తరువాత నవంబర్ 2024 విధానసభ ఎన్నికల నాటికి ఆ ఓటర్ల సంఖ్య 9.70 కోట్లకు పెరిగింది. ఐదు సంవత్సరాల పాటు అతి నెమ్మదిగా 31 లక్షలు పెరిగిన ఆ ఓటర్ల సంఖ్య కేవలం ఐదు నెలల్లో, అవును ఐదు నెలల్లోనే 41 లక్షలకు ఉరుకులు పరుగులు తీసింది! ఇదొక ఆశ్చర్యకరమైన పెరుగుదల. ఇదెంత అపురూపమైన విషయమంటే నమోదైన మొత్తం ఓటర్లు 9.70 కోట్ల మంది కాగా ప్రభుత్వ సొంత అంచనాల ప్రకారమే మహారాష్ట్రలోని మొత్తం వయోజనులు 9.54 కోట్ల మంది మాత్రమే! తృతీయ పర్వం%-% జాబితాలో పెరిగిన ఓటర్ల సంఖ్య కంటే పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య ఎక్కువ కావడం: ఓటుహక్కు వినియోగించుకున్నవారికి, పరిశీలకులకు నవంబర్ 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల పోలింగ్ యథాప్రకారం మామూలుగానే కన్పించింది. ఎన్నికలు జరిగిన ప్రతిచోటా ఎప్పుడూ సంభవించినట్టుగానే ఆ దినం మహారాష్ట్రలో ఎల్లెడలా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించిన వారిని ఓటు వేసేంతవరకు అక్కడే ఉండిపోవడానికి అనుమతించారు.అయితే, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కొండవీడు చాంతాడులా బారులు తీరినట్లు గానీ, పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లుగానీ పత్రికలు, ప్రసార సాధనాలు వెల్లడించనేలేదు. అయితే ఎన్నికల సంఘం భోగట్టా ప్రకారం ఓటు వేసేందుకు ఓటర్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. సాయంత్రం 5 గంటల సమయానికి 58.22 శాతం మంది తమ ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ వ్యవధి ముగిసిపోయినప్పటికీ ఓటు వేసేందుకు మరింత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు.మొత్తం ఓటర్లలో 66.05 శాతం మంది ఓటు వేశారని ఎన్నికల సంఘం ఆ మరుసటి ఉదయం వెల్లడించింది. పోలింగ్ వేళలు ముగిసిన తరువాత కూడా 7.83 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. 7.83 శాతం పెరుగుదల 76 లక్షల ఓటర్లకు సమానం. మహారాష్ట్ర విధాన సభ ఎన్నికలలో అంతకు మునుపు ఎన్నడూ లేని విధంగా నవంబర్ 2024లో చాలా మంది నమోదిత ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ గడువు ముగిసే సమయానికి, ఆ తరువాత ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా 2009లో –0.50 శాతంబీ 2014లో 1.08 శాతంబీ 2019లో 0.54 శాతం కాగా 2024లో ఈ తేడా 7.83 శాతంగా ఉన్నది. చతుర్థ పర్వం– బోగస్ ఓటింగ్‌తో బీజేపికి సంఖ్యాధిక్యత: ఇంకా అనేక అవకతవకలు ఉన్నాయి. మహారాష్ట్రలో లక్ష పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 85 నియోజకవర్గాలలోని 12,000 పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనంగా పోలింగ్ జరిగింది. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ 85 నియోజకవర్గాలలోనే భారతీయ జనతా పార్టీ పరిస్థితి సజావుగా లేదు. ఈ మేరకు ఈ 12 వేల పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌లోను సాయంత్రం 5 గంటల తరువాత సగటున 600మందికి పైగా ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఓటరు ఓటు వేసేందుకు 1 నిమిషం సమయం అవసరమవుతుందనుకుంటే పోలింగ్ విధిగా పది గంటల పాటు కొనసాగవలసి ఉంటుంది. ఇలా ఎప్పుడూ జరగలేదు గనక ఈ పరిస్థితి ఒక ప్రశ్నకు తావిస్తున్నది. అదనపు ఓట్లు వేయడం ఎలా జరిగింది? ఈ 85 సీట్లలో అత్యధిక స్థానాలను ఎన్డీఏ కూటమి గెలుచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎన్నికల సంఘం పేర్కొంది. యువజనులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నందునే పోలింగ్ శాతం పెరిగిందని, ఇదొక సానుకూల పరిణామమని వ్యాఖ్యానించింది. కావచ్చు. అయితే ఈ సానుకూల పరిణామం కేవలం 12,000 పోలింగ్ కేంద్రాలకే పరిమితమయింది. మిగతా 88,000 కేంద్రాలలో ఇది సంభవించలేదు. ఈ సానుకూల పరిణామానికి ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ) కమ్ఠీ నియోజకవర్గాన్ని తీసుకుందాం.

## కేబినేట్ విస్తరణకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఏర్పాట్లు– చేయాల్సిందిగా రాజ్‌భవన్ వర్గాలను సీఎం కోరినట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణలో ముగ్గురికి చోటు– దక్కే అవకాశం ఉందని,అయితే ఈ ముగ్గురు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీపడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు– తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేబినెట్‌లో ప్రాధాన్యత లేదు. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు. ఈ క్రమంలో రేపటి కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు– తెలుస్తోంది. ఓసీ సామాజిక వర్గానికి లేకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో కచ్చితంగా చోటు ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే కసరత్తు చేసిన పేర్లను పార్టీ అధిష్ఠానానికి నివేదించినట్టు– తెలుస్తోంది. ఈరోజు రాత్రికి లేదా రేపు ఉదయానికి మంత్రివర్గంలోకి తీసుకునేవారి పేర్లపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఆదివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణకు గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మకు సమాచారం ఇచ్చినట్లు– తెలుస్తోంది. రేపు నాలుగైదు ముహూర్తాలు ఖరారు చేసినట్లు– సమాచారం. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పేర్లు నిర్ధరణ అయ్యాక.. ఏ ముహూర్తంలో ప్రమాణస్వీకారం ఉంటుందో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పార్టీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు దఫాలుగా చర్చించారు.

## మోదీ, అమిత్ షా వ్యాఖ్యలను ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తున్నారా?: ఆది శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కల్వకుంట్ల కుటుంబానికి ఏటీఎంగా మారిందని భాజపా నేతలు గతంలో చెప్పారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కాళేశ్వరంలో అవినీతి గురించి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఎన్నో సార్లు మాట్లాడారని చెప్పారు. ప్రధాని మోదీ, అమిత్ షా వ్యాఖ్యలను ఈటల రాజేందర్ వ్యతిరేకిస్తున్నారా అని ప్రశ్నించారు. డీపీఆర్‌కు విరుద్ధంగా మేడిగడ్డ ప్రాజెక్టును 5 కిలోమీటర్ల దూరం ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"భాజపాలో భారాస విలీనానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హరీశ్‌రావు, ఈటల రాజేందర్ సమావేశం దేనికి సంకేతమో ఆలోచించాలి. భాజపా నేతలు గతంలో చేసిన వ్యాఖ్యలకు విరుద్ధంగా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఆ రెండు పార్టీల బంధం బలోపేతానికి ఇదే నిదర్శనం. గతంలో చేసిన వ్యాఖ్యలపై భాజపా ఇప్పుడు ఎందుకు యూటర్న్ తీసుకుంది? ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లు భాజపాలో భారాస విలీనం జరుగుతుందా? ఈ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను దొంగ దెబ్బ తీసే కుట్ర చేశాయని ఎన్నో సార్లు చెప్పాం.కాళేశ్వరం అంచనాను రూ.30 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారు? కాళేశ్వరం అవినీతి నుంచి కేసీఆర్ కుటుంబాన్ని బయటపడేసే ప్రయత్నం భాజపా చేస్తోంది. కాళేశ్వరం నిర్మాణం అంతా కేసీఆర్ ఇష్టానుసారమే జరిగిందని గతంలో ఈటల అన్నారు. కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మంత్రివర్గం నిర్ణయం ప్రకారమే నిర్మించారని ఎందుకు అంటున్నారు?" అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.

## యూట్యూబర్ల తీగ లాగితే గూఢచర్యం డొంక కదులుతోంది

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్న ధిల్లాన్‌కు ఐఎస్‌ఐతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఐఎస్‌ఐ అధికారులకు జస్బీర్‌ను పరిచయం చేసింది ధిల్లానే. పాక్‌కు గూఢచర్యం కేసులో ఇటీవల అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా తో కలిసి 10 రోజులు లాహెూర్‌లో ఉన్నట్లు జస్బీర్ విచారణలో పేర్కొన్నాడు. ఆ సమయంలో ధిల్లాన్ భారత్ యూట్యూబర్లను పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌కు పరిచయం చేశాడు. అక్కడ డానిష్ గూఢచర్యం గురించి వారికి వివరించాడు. కాగా.. భారత్ యూట్యూబర్లను గూఢచర్యంలోకి లాగే వ్యవహారంలో పాక్‌కు చెందిన అనేక మంది మాజీ పోలీసులు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈక్రమంలోనే పాక్‌కు గూఢచర్యం చేస్తున్నాడనే ఆరోపణలతో 'జాన్ మహల్' అనే పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్న జస్బీర్‌సింగ్‌ను అధికారులు అరెస్టు చేశారు. డానిష్‌తో పాటు, పాక్‌కు చెందిన మరికొందరు అధికారులతో జస్బీర్‌కు సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. 2020, 21, 24లలో శత్రుదేశంలో పర్యటించాడు. ఇక, పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై జ్యోతి మల్హోత్రా అరెస్టయిన సంగతి తెలిసిందే.

## జనగణన ఆలస్యం

### కేంద్రం పన్నుతున్న దుష్ట పన్నాగమే: స్టాలిన్

మొదటిపేజీ తరువాయి

దేశంలో జనాభా లెక్కింపు 2027 మార్చి 1 నుంచి జరగనుందని కేంద్ర అధికార వర్గాలు ఇటీవల వెల్లడించాయి. దీంతోపాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. ఈవిషయంపై తమిళనాడు సీఎం ఎంకే. స్టాలిన్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని లెక్కలు వేసుకొని కావాలనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనను ఆలస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. జనగణన ఆలస్యం దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం పన్నుతున్న దుష్టపన్నాగమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల హక్కులను నిర్వీర్యం చేస్తోందని స్టాలిన్ విమర్శించారు. జనగణన ఆలస్యం అప్పటికప్పుడు తీసుకొన్న నిర్ణయం కాదని.. నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళిక యాదృచ్ఛికం కాదని వ్యాఖ్యానించారు.పునర్విభజన వల్ల ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య కొనసాగినా.. 848కి పెంచినా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందని పునరుద్ఘాటించారు. ఇది తమిళనాడుకు మాత్రమే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాల డిమాండ్లను పరిష్కరిస్తామని కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ప్రకటించినప్పటికీ అవి అస్పష్టమైన వ్యాఖ్యలుగానే మిగిలిపోయాయని స్టాలిన్ అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని అక్కడి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ అది కేంద్ర పాలిత ప్రాంతంగానే మిగిలిపోయిందని అన్నారు. కశ్మీర్‌లో ఎన్నికలు జరిగినా, రాష్ట్ర హెూదా విషయంలో సుప్రీంలో హామీలు ఇచ్చినా ఏమీ లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

**జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆటంకం రానీయను**

కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను చేపడితే దేశంలో ప్రజాస్వామ్య శక్తి బలహీనం అవుతుందని స్టాలిన్ హెచ్చరించారు. దీనివల్ల భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాలకు ముప్పు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్నాడీఎంకే వంటి పార్టీల ద్రోహులు తమ రాజకీయ మనుగడ కోసం భాజపా ముందు మోకరిల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారు ఎన్ని కుట్రలు పన్నుతున్నప్పటికీ డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రజలు రాష్ట్ర పురోగతిని అడ్డుకోవడాన్ని ఎప్పటికీ ఉపేక్షించరని అన్నారు.సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపైనా స్పష్టత లేకుండా పోయింది. 16 ఏళ్ల తర్వాత తొలిసారి 2027 మార్చి 1న జనాభా గణన నిర్వహించనున్నట్లు ఇటీవల కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి.

## యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోంది

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దేశంలో గత 11 ఏళ్లుగా సుపరిపాలన సాగుతోందని, అందుకే యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా వివరించాలని, వ్యతిరేక ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణకు కేంద్రం అన్ని రంగాల్లో నిధులిచ్చిందని తెలిపారు."ఉగ్రవాదుల చేతుల్లో వందలమంది చనిపోతే గతంలో కాంగ్రెస్ స్పందించలేదు. ఉగ్రవాదులు పర్యాటకులను చంపితే 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేశాం. తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించే పార్టీ భాజపా. కాంగ్రెస్, భారాసలు ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయాయి" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## ఈటల తప్పుడు రిపోర్టు ఇచ్చారు..

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం కమిషన్ కు ఈటల రాజేందర్ తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని మంత్రి తుమ్మల అన్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు పొంతన లేకుండా సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. సెక్రటేరియట్ లో కాళేశ్వరం వ్యవహారంపై మట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు.. ఈ అంశంపై త్వరలోనే కమిషన్ కు లేఖ రాయనున్నట్లు తెలిపారు.

కాళేశ్వరం నిర్మాణానికి సంబంధించినది సబ్ కమిటీ కాదని.. అది రాష్ట్రంలో అప్పట్లో పెండింగ్ ప్రాజెక్టుల మీద వేసిన సబ్ కమిటీ మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణాల్లో సబ్ కమిటీ ఎలాంటి నిర్ణయాలు చేయలేదని అన్నారు. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ అనుమతించింది అనేది వాస్తవం కాదని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు క్యాబినెట్ అప్రూవల్ కు రాలేదని.. ఈ విషయంలో ఈటల ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చారని మండిపడ్డారు. సబ్ కమిటీ కి.. కాళేశ్వరం నిర్మాణానికి ఎలాంటి సంబంధం లేదు ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ఈటల కు అబద్ధాలు ఆడాల్సిన అవసరం ఏమొచ్చిందోనని అన్నారు.

తనను అనవసరంగా కమిషన్ ముందుకు లాగే దురాలోచన మంచిది కాదని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల అన్నారు. 43 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎక్కడ కూడా తెలిసి తప్పు చేయలేదని.. కానీ కమిషన్ కు ఈటల ఇచ్చిన సమాచారం చూశాక బాధ వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తప్పుడు సమాచారం ఇచిన ఈటల పునరాలోసించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. సబ్ కమిటీ రిపోర్ట్, కమిటీ ఏం చేసింది అనేది కమిషన్ కు త్వరలోనే అన్ని వివరాలు ఇస్తానని.. త్వరలోనే కమిషన్ కు లేఖ రాస్తానని చెప్పారు.

రాజకీయాలు వేరు.. రాష్ట్ర అభివృద్ధి వేరని మంత్రి తుమ్మల అన్నారు. రాష్ట్ర ప్రజలకు అవసరమైన వాటినే చేశానని.. అవసరం అనుకుంటే ఆధారాలతో సహా ఎవరితోనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కాళేశ్వరం విషయంలో హరీష్ రావు ఇంకా అబద్ధాలు ఆడేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

## అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కూలినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మొత్తంగా ప్రాజెక్టు ద్వారా 20.33 లక్షల ఎకరాలకు నీరు అందించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మహారాష్ట్ర అభ్యంతరం చెప్పకుండా చర్చలు జరిపామని, ప్రభుత్వం ఏర్పడిన 45 రోజులకే మహారాష్ట్రకు వెళ్లి చర్చించి ఒప్పించామన్నారు.

"కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కి.మీ సొరంగాలు, 1,531 కి.మీ గ్రావిటీ కాలువలు, 98 కి.మీ ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు నీటి ఎత్తిపోతలు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోసేలా మొదట రూపకల్పన చేశారు. తమ్మిడిహట్టి వద్ద నీళ్లు తక్కువ ఉంటాయని ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాం. మేడిగడ్డ బ్యారేజీని 7 బ్లాకులుగా 85 పియర్లుగా నిర్మించారు. కాళేశ్వరం లేకుండా పంటలు పండాయని కాంగ్రెస్ చెబుతోంది. ఈ ప్రాజెక్టు వల్లనే యాసంగిలోనూ పంటలు పండాయి. ఈ ప్రాజెక్టుకు 3 వనరుల ద్వారా నీటి లభ్యత ఉంది. ఆ నీటితో వేలాది చెరువులు నింపొచ్చు. మేడిగడ్డ నుంచి మల్లన్న సాగర్ వరకు నిర్మించినవన్నీ వాడకంలోనే ఉన్నాయి. కాళేశ్వరం కింద కాలువ ద్వారానే 90 వేల ఎకరాలకు నీరు అందించొచ్చు.

రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు గోదావరి జలాల్లో 940 టీఎంసీలు కేటాయించారు. తెలంగాణ గోదావరి జలాలను ఏనాడూ 400 టీఎంసీలకు మించి వాడుకోలేదు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్లలో అనుమతులు కూడా సాధించలేదు. ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించకుండానే కాలువల తవ్వకం పనులు చేపట్టారు. 2007లో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ.17 వేల కోట్లుగా చెప్పారు. ప్రాజెక్టు ప్రారంభించకముందే 2011నాటికి అంచనా వ్యయాన్ని రూ.40 వేల కోట్లకు పెంచారు"అని హరీశ్‌రావు అన్నారు

## తెలంగాణ కేబినేట్లోఓ విజయశాంతికి చోటు?

రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుందనే విషయంలో అప్పుడూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతానికి చోటు దక్కే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణ జరుగనున్నదనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ విజయశాంతికి మంత్రి పదవి ఖాయం అనేది సర్వత్రా చర్చ మొదలైంది. అలాగే వివేక వెంకట్ స్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌లకు కూడా చోటు దక్కవచ్చని ప్రచారం సాగుతోంది. గతంలో గ్రేటర్ నుంచి రాష్ట్రమంత్రి వర్గంలో ప్రాతినిధ్యం ఉండేది. ప్రస్తుతం లేదు. అయితే, ఎన్నికల్లో గ్రేటర్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులెవరూ విజయం చేజిక్కించుకోలేదు. దీంతో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతానికి రాష్ట్ర క్యాబినేట్ దక్కలేదు. నామినేటెడ్ కేటగిరిలోనూ పలువురు ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. అందులో విజయశాంతి ఒకరు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక.. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ప్రస్తుతం గ్రేటర్‌కు మంత్రి పదవి రావడం ఖాయమనేది, అందులో విజయశాంతి పేరు అధికంగా వినిపిస్తున్నది. ఎన్నికల్లో పార్టీ తరపున ప్రచారం చేశారు. అధికారం వచ్చాక ఏమీ అడగలేదనీ, ఎమ్మెల్సీ పదవిని పిలిచి ఇచ్చారనేది టాక్ ఉన్నది. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గం 11 మందితో ఉండగా అందులో ఇద్దరు మహిళలు కొండా సురేఖ, సీతక్కలకు మాత్రమే మంత్రి పదవి లభించింది. ఉన్న వారిలోనూ 1:3 గా చూసినా మరో మహిళకు మంత్రివర్గంలో చోటుకల్పించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనూ విజయశాంతికి మంత్రి పదవి లభించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు సినీరంగానికి చెందిన ఆమెకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల చలనచిత్ర పరిశ్రమ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే దిశగా ప్రయత్నం చేసినట్టుగా ఉంటుందనేది రాజకీయ వర్గాల్లోని అభిప్రాయం. ఇకపోతే వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల పేర్లుకూడా వినిపిస్తున్నాయి. రాహుల్ వీరిద్దరికీ హామీ ఇచ్చారని ప్రచారం. అయితే ఎవరెవరు అదృష్టవంతులో ఆదివారం ఉదయానికి తేలనుంది.

# పర్యవేక్షణ లోపం.. రైతులకు శాపం..

**- గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులోని గోదావరి నదిపైన నిర్మించిన "గంగనాలా" ప్రాజెక్ట్ గంగపాలు కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.**

- డ్రెనేజీని తలపిస్తోన్న గంగనాల కాలువ
- రైతులకు తప్పని సాగునీటి తిప్పలు

- ఆయకట్టు క్రింద 6 వేల ఎకరాల కు సాగు నీరు
- కాలువ శుభ్రం చేస్తేనే 9 గ్రామాలకు సాగునీరు


గోదావరి నదిపైన గంగనాలా ప్రాజెక్ట్ ఆయకట్టు మాటు


డ్రెనేజీని తలపిస్తోన్న "గంగనాలా" కాలువ


కాలువలో పెరిగిన తుంగ


గుజ్జె గంగాధర్ మాజీ విడిసి చైర్మన్,వేములకుర్తి


ఆరె రమేష్, బిజెపి సీనియర్ నాయకులు, వేములకుర్తి

నిత్యం జలకళ తో కళకళలాడుతూ ఉండే గంగనాలా కు గడ్డుకాలం గడ్డుకాలం వచ్చింది.ఈ గంగనాలాకు మెదట గలమ చెక్కల గండి ధ్వంసం అయ్యి నీరు దిగువకు పోయే పరిస్థితి నెలకొంది.అధికారులు శ్రద్ధ తీసుకుని మరమ్మత్తులు చేసి, కాలువ శుభ్రం చెయ్యకపోతే 9 గ్రామాలలోని గంగనాలా ఆయకట్టు 4 వేల ఎకరాల సాగు కష్ట కాలమే దాపురించేటట్టు ఉంది. కాలువ లో పెరిగిన తుంగ తదితర చెట్లు, మట్టితో కాలువ అధ్వాన్నంగా మారి డ్రెనేజీని తలపిస్తున్నది.సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ లోపం రైతుల పాలిటీ శాపంగా మారిదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించడానికి ముందే 1959లో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులోని గోదావరి నదిపైన సుమారు రెండు మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల ఎత్తుతో అడ్డుగోడ లాగా మత్తడి ని నిర్మించారు.శ్రీరామ్ సాగర్ గా పిలవబడుతున్న పోచంపాడు ప్రాజెక్ట్ 1963 లో నిర్మాణం ప్రారంభమయ్యింది.శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కంటే ముందే ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని ఆరు గ్రామాలకు చెందిన దాదాపు 2500 హెక్టార్ల వ్యవసాయ భూమికి అంటే దాదాపు 6200 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ నీటి పారుదల పథకానికి రూపకల్పన చేశారు. నిరంతరం నిండుకుండలా తొణికిసలాడుతూ ఆయకట్టు రైతుల పాలిట కల్పతరువుగా ఈ ప్రాజెక్టు ప్రసిద్ధిగాంచింది గంగనాలా.అయితే మూడు, నాలుగేండ్లుగా సమృద్ధిగా వర్షాలు కురిసినా.. ఎక్కువగా నీరు వచ్చి చేరినా.. స్టోరెజీ లేక పోవటం తో నీరు దిగువకు ప్రవహించి గంగనాలా నీరు గోదావరి నదిలోనికి చేరుతున్నది.ఇటీవల భారీ వర్షాలు కురవడం, గోదావరి ఉధృత ప్రవాహంతో వరదనీటి చేరికతో నిండు కుండను తలపించిన గంగనాలా నీటితో ఖరీఫ్ ,రభిలో మంచి పంటలు పండడం వల్ల, రైతులు ఆనందంలో మునిగారు.గంగనాల ఆయకట్టు ప్రధాన తూము పగుళ్ల తేలాయి.తలుపులు తుప్పు పట్టాయి. దీంతో వేములకుర్తి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో 17 సంఘాలకు చెందిన సభ్యులు తలపులు వద్ద ఇసక బస్తాలు వేసి పంటలు పండిచుకున్నారు.పలు చోట్ల గ్రామస్తులు మరమ్మతులు చేయించారు. గతంలో రైతులు ఎగువన ఉన్న మైసమ్మ మూల, తునికీ దోరం వద్ద రాతిగోడ, గడ్డీ తో గంగనాల ప్రాజెక్ట్ కు నీరు ప్రవహించేటట్టు తెచ్చె శ్రమదానం చేశారు. గంగనాలప్రాజెక్ట్ తలుపు తుప్పు పట్టి పైకి లేవలేని స్థితిలో ఉడటం,సంబధిత నిటి పారుదల అధికారులు పర్యవేక్షణ లేక పోవటం ఓ వైపు రైతుల పాలిట శాపం గా మారింది.జగిత్యాల జిల్లా మూలరాంపుర్-నిర్మల్ జిల్లా పొంకల్ గ్రామ శివారు లో నిర్మించిన సదరు మాటు బ్యారేజీ నిర్మాణ కాంట్రాక్టర్లు గంగనాలా మాటుకాలువకు వచ్చే పాయ లో రాల్లు చదును చేయటం తో అయకట్టు క్రింద ఉన్న ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి, యామాపుర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలం లోని నడికుడ,మెగిలి పేట, ఓబులాపూర్, సంగెం శ్రీరాం పూర్, దామరాస్ పెళ్ళి, వాల్గొండ ఆయకట్టుకు నీరు అందటం కష్టంగా మారింది. రైతులు విడుతల వారిగా గంగనాలాకు నీరు తెచ్చే యత్నం చేయక తప్పటం లేదు.కాలువ దాదాపు నాలుగు కిలోమీటర్లు చదును చేస్తే తప్ప ఖరీఫ్ లో దిగువకు నీరు పోయె పరిస్థితి లేదు.సంబంధిత శాఖ అధికారులు ,ప్రజా ప్రతినిధులు స్పందించి ఆయకట్టు కాలువ మరమ్మతులు చేసి రైతుల ఇక్కట్లు తీర్చాలని అయకట్టు రైతులు కోరుతున్నారు.

**- కాలువ మరమ్మతులు చేయాలి**
**- గుజ్జే గంగాధర్ మాజీ విడిసి చైర్మన్ వేములకుర్తి**

గంగనాలా ఆయకట్టు క్రింద అధిక సంఖ్యలో రైతుల పొలాలు ఉన్నాయి.చెక్కల గండి వద్ద తూము ధ్వంసమైంది.నీరు వచ్చే కాలువ డ్రెనేజీలా మారి తుంగ, మట్టి తదితర చెట్లతో నిండి గలుమకు నీరు వచ్చే పరిస్థితి లేదు.సంబంధిత నీటిపారుదల శాఖ అదికారులు వర్షాలు రాకముందే మరమ్మతులు చేపట్టాలి.

**- గంగనాలా అయకట్టు కు అదికారుల పర్యవేక్షణ కరువైంది**
**- ఆరె రమేష్ బిజెపి సీనియర్ నాయకులు,వేములకుర్తి**

గంగనాలా ఆయకట్టు క్రింద ఉన్న ఇబ్రహింపట్నం, మల్లాపూర్ మండలాలలోని 9 గ్రామాలకు సాగునీరు ప్రవహిస్తుంది. కాలువను ఎప్పటికప్పుడు పరిశీలించవలసిన అధికారుల పర్యవేక్షణ లోపంతో కాలువ నిర్జీవంగా మారింది. రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభించకముందే అదికారులు స్పందించాలి.

## త్యాగానికి గుర్తు బక్రీద్ పండగ



**- కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

త్యాగానికి గుర్తు బక్రీద్ పండగ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు.బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు కోరుట్ల నియోజకవర్గము మెట్టుపల్లి పట్టణంలోని ఈద్గాలో మరో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ తో కలిసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పట్టణంలోని పలువురు ముస్లిం ప్రముఖుల ఇళ్లలో వృద్ధులను ఇతరులను కలిసి కృష్ణారావు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణానికి చెందిన ముస్లిం ప్రముఖులతో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, యామ రాజయ్య, పూదరి నర్సాగౌడ్, రాజేశ్వర్ గౌడ్, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి,మహేందర్ తదితరులు ఉన్నారు

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల

**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ జూన్ 07**
బాన్సువాడ పట్టణంలోని ఈద్గా వద్ద శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని కలిసి కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, నాయకులు అలీబిన్ అబ్దుల్లా, కాసుల రోహిత్,ఎజస్, నార్ల రవీందర్ గుప్తా, నరసన్న చారి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు...

**కరపత్రం ప్రతినిధి బోధన్, జూన్ 07..**
బోధన్ పట్టణంలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లీంల పవిత్ర పండుగ పురస్కరించుకొని శనివారం పట్టణ శివారులోని ఈద్గా వద్ద ముస్లీం లు అత్యంత భక్తి శ్రద్దలతో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్బంగా పట్టణ కాంగ్రెస్ నాయకులు ఈద్గా కు చేరుకుని ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా, సీనియర్ నాయకులు తూము శరత్ రెడ్డి, రాములు, ప్రభాకర్, దూప్ సింగ్, ప్రమోద్, తలారీ నవీన్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**





జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష కార్యదర్శులు కర్నాటి వాసు, కె. వి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఫిట్నెస్ క్లబ్ మోపాల్ లో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇవ్వాళ జరిగిన 11వ జిల్లా సెలెక్షన్ టోర్నమెంట్లో వివిధ విభాగాల్లో క్రీడాకారులు విజయం సాధించి త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించారని వారు తెలిపారు.విజేతలుగా నిలిచిన క్రీడాకారులు పురుషుల,మహిళల విభాగంలో సింగిల్స్ విన్నర్ పి.ప్రణవ్ శ్రీకర్ రన్నర్ గా కె.మానవ్ నిలిచారు.డబుల్స్ విన్నర్ గా కె.ప్రణయ్ అండ్ ఎం.రోహిత్ లు నిలిచారు.మహిళల సింగిల్స్ విన్నర్ గా ఏ. శ్రీవల్లి నిలిచారు. డబుల్స్ విన్నర్ గా యస్.వీ.ఎస్.శ్రీవైష్ణవి,ఏ. శ్రీవల్లి లు నిలిచారు.మిక్స్ డబుల్స్ విన్నర్ దుర్కికర్ సాయిచరణ్ అండ్ జీ. కనిష్ లు విజేతలుగా నిలిచారు.అండర్ 19 విభాగంలో సింగిల్స్ విన్నర్ బాలురు కే. మానవ్,రన్నర్ గా యస్ విశ్వక్ లు నిలిచారు.డబుల్స్ బాలురు విభాగంలో ఎం.విశ్వజిత్,ఎస్.విశ్వక్ విజేతలుగా నిలిచారు.అండర్ 17 బాలురు విభాగంలో సింగిల్స్ విన్నర్ గా ఎం. విశ్వజిత్,రన్నర్ గా కె.కార్తికేయ లు నిలిచారు.డబుల్స్ విన్నర్ బాలురు ఎం. వాస్తవ,వై.రూపలు నిలిచారు.ఈ కార్యక్రమంలో ఎం.సాయి రెడ్డి కోశాధికారి శ్రీనివాస్ గౌడ్ కార్య నిర్వాహక కార్యదర్శి పీ.ప్రకాష్ ఉపాధ్యక్షులు గంగాధర్ గౌడ్ లు పాల్గొన్నారు.

## టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**- రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ...**

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**




టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్ పోస్టర్లను నగరంలోని ఎన్.ఆర్ భవన్ కోటగల్లీలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు,చట్టాలను రద్దుచేసే కుట్రలను కేంద్రప్రభుత్వం చేస్తుందన్నారు.అందులో భాగంగానే కార్మిక అనుకూల చట్టాలను కుదించి 4 లేబర్ కోడ్ లను తీసుకొస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.టీయూసీఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎం.నరేందర్, ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ,ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) తెలంగాణ రాష్ట్ర మహాసభలను జిల్లా కేంద్రంలో ఈనెల 21,22 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు.మొదటి రోజు ర్యాలీ బహిరంగ సభ 2వ రోజు ప్రతినిధుల సభ నిర్వహిస్తామన్నారు.ఈ మహాసభలకు టీయూసీఐ జాతీయ నాయకులు,వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు.ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామని,గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాల రూపకల్పన చేసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ జిల్లా నాయకులు సాయన్న,కిరణ్ నాయకులు చరణ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
న్యాయమైన ఉద్యోగుల,రిటైర్డ్ ఉద్యోగుల కోరికలను పరిష్కరించటంలో ప్రభుత్వం చొరవ చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అమలుకు అవకాశాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ అలుగుబిల్లి నర్సిరెడ్డి అన్నారు.శనివారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఒక డిఏ ఇప్పుడు ప్రకటించి మరొక డిఏ ను పది నెలల తర్వాత చెల్లిస్తామని చెప్పటం సరైంది కాదని,అదేవిధంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సంబంధించి ఉద్యోగుల కంట్రిబ్యూషన్ తో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ముందుగా బదిలీ చేయాలని అప్పుడు మాత్రమే ఈ పథకం పక్కాగా అమలు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.పిఆర్సి గురించి మాట మాత్రం కూడా చర్చించకపోవడం సరైనది కాదని ఆయన అన్నారు.రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనాలని సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలకు వ్యతిరేకంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రభుత్వ బడులను ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్ట పరచాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారంలో భాగంగా ఆయన నిజామాబాదుకు వచ్చారు.ఈ పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు కే.రామ్మోహన్రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవిల్ నారాయణ,జిల్లా నాయకులు హామీదుద్దీన్, సాంబశివరావు,సిర్ప లింగయ్య,రాధా కిషన్,బాబా గౌడ్,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్న



### - బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 7**
జమ్మికుంట మండలంలో నగురం గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులకు బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోలుగూరి సదయ్య వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం కొరకు వారు పోసుకునే ముగ్గు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం అదే గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని సందర్శించడం జరిగింది. బిజిగిరి షరీఫ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోశెట్టి నాగభూషణం, అతనికి అనారోగ్య పరిస్థితులను జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మోలుగూరి సదయ్య అడిగి తెలుసుకోవడం జరిగింది మరియు అతనికి మనోధర్యం చెబుతూ ధైర్యంగా ఉండాలని తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మనోధైర్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ SC సెల్ అధ్యక్షులు రాచపల్లి రమేష్, నాగురం మాజీ సర్పంచ్ అంతటి సమ్మయ్య గౌడ్, ఊర సంపత్ రావు, కవంపల్లి శ్రీనివాస్, అంతటి సంతోష్, కావాంపల్లి సంపత్, దార వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాదర్ గుల్ కార్యక్రమం





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 7**
బిజిగిరి షరీఫ్ గ్రామంలోని హజరత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లా అలై దర్గాలో శనివారం సాయంత్రం గుసుల్ కార్యక్రమం తర్వాత ఘనంగా చాదర్ గుల్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైదరాబాద్ నుండి తెచ్చిన చాదర్లను దర్గాలోని సమాధులకు ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్ర మినిమం వెజ్ మాజీ అధ్యక్షుడు అల్ హజ్ బాబర్ సలీం పాషా, దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కరీం, తౌఫిక్ హుస్సేన్, జమాల్ అష్రఫ్, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

### తాజా కాల్పుల్లో మరో ఐదుగురు మావోల హతం

**కరపత్రం ప్రతినిధి రాయ్‌పూర్,జూన్7**
ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా తుపాకుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా దళాలు.. కంటికి కనిపించిన మావోయిస్టులను కాల్చుకుంటూ పోతున్నాయి. ఇప్పటికే పలువురు అగ్రనేతలు ఎదురు కాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం కూడా ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపూర్ ల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఘటనాస్థలిలో రెండు ఏకే 47 రైఫిళ్లు, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు రోజులుగా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీ-ఎఫ్) భద్రతా దళాలు గత నాలుగు రోజులుగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురు, శుక్రవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్, భాస్కర్ మరణించారు. భాస్కర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించగా, సుధాకర్‌పై రూ.40 లక్ష రివార్డు ఉన్నది.

## మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నకారు

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదులాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..సైనిక్‌పురికి చెందిన వర్షిత్, కుంట్లూరుకు చెందిన భార్గవ్ యాదవ్, ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ప్రవీణ్, వైజాగ్‌కు చెందిన దినేష్ మిత్రులు. వీరు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనులు చేస్తున్నారు. శుక్రవారం ఎదులాబాద్ సమీపంలోని విహారి ఫామ్‌హౌస్‌లో విందు ఏర్పాటుచేసుకొని మరింత ఆహార పదార్థాల కోసం అర్ధరాత్రి సమయంలో నలుగురు ప్రయాణిస్తున్న కారు ఎదులాబాద్ నుండి మాదారం క్రాస్ వద్ద విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది.

## కోట దుర్గమ్మ మరణం తీరని లోటు....

### - సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
కోట దుర్గమ్మ మరణం దళిత సమాజానికి తీరని లోటు అని సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకులు , సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సమంత సైనిక దళ్ ఎన్టిపిసి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోట దుర్గమ్మ సంతాప సభలో మార్షల్ దుర్గం నగేష్ దళిత సంఘాల ప్రజాసంఘాల నాయకులతో కలిసి కోట దుర్గమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు, జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోట దుర్గమ్మ తన బిడ్డ కొడుకు అయినటువంటి చీమల ఆనంద్ ను చిన్నతనం నుండే పెంచి పెద్ద చేసి ప్రయోజకున్ని చేసిందని అన్నారు. చీమల ఆనంద్ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్



గారి ఆశయాల సాధనకు నిర్విరామంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజ సేవలో భాగంగా తాము సమతా సైనిక దళ్, సమతా ఫౌండేషన్ల ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల్లో ఆనంద్ అందర్నీ కోఆర్డినేషన్ చేస్తూ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని అన్నారు. మంచి సమయస్ఫూర్తి కలిగిన ఆనంద్ ను తమకు అందించిన కోట దుర్గమ్మకు రుణపడి ఉంటామని తెలిపారు. కుల మత వర్గ బేధం లేకుండా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చీమల ఆనంద్ కుటుంబానికి సమతా సైనిక దళ్ , సమతా ఫౌండేషన్ ల ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహ ర్ సంక్షేమ సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నరసయ్య, నేతకాని మహర్ సంఘం రాష్ట్ర యూత్ నాయకులు రామటెంకి నవీన్ మాల మహానాడు సీనియర్ నాయకులు ముక్క సుదర్శన్, అంబేద్కరిస్ట్ కేవల్ బహుజన్, బీఎస్పీ పార్టీ రాష్ట్ర నాయకులు పేగ నరేష్, గాయకుడు జనగామ రాజన్న, రామగుండం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పరకాల లక్ష్మీనారాయణ, సభ్యులు డాక్టర్ నంబయ్య, ఐఎఫ్టియు నాయకులు రామటెంకి మల్లేష్, సమతా సైనిక దళ్ నాయకులు జిమ్మీడి అశోక్, జిమ్మిడి శాంతి కుమార్, చందనగిరి శివప్రసాద్, గూడూరి లవన్ కుమార్, గన్న మహేష్, బండారి రాజేందర్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు బూడిద మహేందర్, నేతకాని, మాల, మాదిగ, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనం సాక్షి ఎడిటర్ రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలి

### - టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
జనం సాక్షి పత్రిక ఎడిటర్ ముజీబుర్ రెహమాన్ పై కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య అన్నారు. శనివారం వారు ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అక్రమ కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కడంలో భాగంగానే అక్రమకేసుల బనాయింపు అని అన్నారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతాంగం జరుపుతున్న పోరాటంలో రెహమాన్ ను బాధ్యుడిగా పేర్కొంటూ ఆయనపై అక్రమ కేసు బనాయించడం సరైంది కాదన్నారు. ఇది ముమ్మాటికీ ప్రశ్నించేవారి గొంతునొక్కడమేనని, బాధ్యతాయుతమైన





పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రజలతో పాటు ఆందోళనలో పాల్గొనకపోయినప్పటికీ, రైతుల ఆందోళనకు సంబంధించిన వార్తలు ప్రచురించినందుకు జర్నలిస్టు రెహమాన్ ను ప్రధాన నిందితుల్లో చేర్చడం దుర్మార్గమని అన్నారు. వ్యతిరేక వార్తలపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి తప్ప అక్రమంగా కేసులు నమోదు చేయటం సరికాదని సూచించారు. పెద్ద ధన్వాడలో ఇథనాలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో ప్రత్యక్షంగా రెహమాన్ ఘటనాస్థలిలో లేకపోయినా.. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలి పోలీసులు కేసు నమోదు చేయడం కక్ష సాధింపు చర్యలో భాగమన్నారు. ఇది ముమ్మాటికి పత్రిక స్వేచ్ఛపై దాడి చేయడమే అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నిరసన, వ్యతిరేకతను కళ్లకు కట్టినట్లు ప్రచురించడంతోనే ఫ్యాక్టరీ యాజమాన్యం తట్టుకోలేకపోకనే ఇటువంటి కక్ష కట్టి అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. పర్యావరణానికి, జల కాలుష్యానికి కారణమవుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించి జనం సాక్షి సంపాదకుడు రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

## తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మిత్రులు







**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, ఏవీఎన్ టీవీ న్యూస్ ఛానల్ సీఈఓ, మహానది పత్రిక ఎడిటర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు శనివారం వనస్థలిపురంలోని ఏవీఎన్ టీవీ, మహానది పత్రిక కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పలువురు ఏవీఎన్ టీవీ సిబ్బంది, మహానది పత్రిక రిపోర్టర్లు పాల్గొని మామిడి సోమయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, కోశాధికారి ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ యర్రమిల్లి రామారావు, సీనీయర్ జర్నలిస్టు జెనుగుర్తి ఉదయ్ భాస్కర్ రెడ్డి, ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా నాయకులు గోవింద రావు తదితరులు మామిడి సోమయ్యకు బొకే శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

## జనం సాక్షి ఎడిటర్ రెహమాన్ పై కేసు అప్రజాస్వామికం

### - అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలి

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
జనం సాక్షి పత్రిక ఎడిటర్ ముజీబుర్ రెహమాన్ పై కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య అన్నారు. శనివారం వారు ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అక్రమ కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కడంలో భాగంగానే అక్రమకేసుల బనాయింపు అని అన్నారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతాంగం జరుపుతున్న పోరాటంలో రెహమాన్ ను బాధ్యుడిగా పేర్కొంటూ ఆయనపై అక్రమ కేసు బనాయించడం సరైంది కాదన్నారు. ఇది



ముమ్మాటికీ ప్రశ్నించేవారి గొంతునొక్కడమేనని, బాధ్యతాయుతమైన పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రజలతో పాటు ఆందోళనలో పాల్గొనకపోయినప్పటికీ, రైతుల ఆందోళనకు సంబంధించిన వార్తలు ప్రచురించినందుకు జర్నలిస్టు రెహమాన్ ను ప్రధాన నిందితుల్లో చేర్చడం దుర్మార్గమని అన్నారు. వ్యతిరేక వార్తలపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి తప్ప అక్రమంగా కేసులు నమోదు చేయటం సరికాదని సూచించారు. పెద్ద ధన్వాడలో ఇథనాలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలో ప్రత్యక్షంగా రెహమాన్ ఘటనాస్థలిలో లేకపోయినా.. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలి పోలీసులు కేసు నమోదు చేయడం కక్ష సాధింపు చర్యలో భాగమన్నారు. ఇది ముమ్మాటికి పత్రిక స్వేచ్ఛపై దాడి చేయడమే అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నిరసన, వ్యతిరేకతను కళ్లకు కట్టినట్లు ప్రచురించడంతోనే ఫ్యాక్టరీ యాజమాన్యం తట్టుకోలేకపోకనే ఇటువంటి కక్ష కట్టి అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. పర్యావరణానికి, జల కాలుష్యానికి కారణమవుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించి జనం సాక్షి సంపాదకుడు రెహమాన్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.